ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి రైల్వే స్టేషన్‌లో కాచిగూడ ఎక్స్‌ప్రెస్, రత్నాచల్ సూపర్ ఫాస్ట్‌లకు హాల్టు కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్‌కు డైలీ పాసింజర్ అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, కార్యదర్శి ఏవి రమణలు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం శాసనసభ్యులు సుందర విజయ కుమార్ రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ ఇచ్చిన వినతి పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పట్టణ పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీను, ఆడారి రమణబాబు, కార్యదర్శి గొర్ల నానాజీ, సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, మాజీ సర్పంచ్ లవడు లోవ రాజు, సోము నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గొన్నాబత్తుల శేషు, గుర్రాల శేఖర్, శివ శంకర్, నరేష్, సత్యనారాయణ, శివ, రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

246 కిలోల గంజాయి స్వాధీనం: ఎస్పీ దీపిక

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలో చీడికాడ, రావికమతం పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులలో మొత్తం రూ.12,30,000/- విలువ గల 246 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 1వ తేదీ సాయంత్రం 04.00 గంటలకు రావికమతం పోలీసులకు కవ్వగుంట గ్రామం గుండా గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని రాబడిన నమ్మకమైన సమాచారం మేరకు రావికమతం ఎస్సై జి.ధనుంజయ నాయుడు సిబ్బంది, మధ్యవర్తుల సమక్షంలో నిందితుడు పి.సత్యనారాయణను పట్టుకొని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి ఏపి 39 ఎల్ 9295 నెంబరు గల ఈకో స్టార్ పాసింజర్ వాహనం, రెండు మొబైల్ ఫోన్లు, 500 రూపాయలు నగదు రూ.4,80,000/- విలువచేసే 96 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అదే రోజు చీడికాడ పోలీసులకు మంచాల గ్రామం గుండా గంజాయి అక్రమ రవాణా జరుగు తుందని రాబడిన సమాచారం మేరకు చీడికాడ ఎస్సై జి.నారాయణరావు సిబ్బంది, మధ్యవర్తుల సమక్షంలో దాడి చేసి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలానికి చెందిన శోభ శ్రీను, వేమల ఈశ్వరరావు, కొర్ర కొండబాబు, పాత్రుని దిలీప్ కుమార్ నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఒక ద్విచక్ర వాహనం, ఒక ఆటో, నాలుగు మొబైల్ ఫోన్లు రూ.7,50,000/- విలువచేసే 150 కేజీల కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెండు కేసులను చాకచక్యంగా చేధించిన పోలీసులను జిల్లా ఎస్పీ అధికారులకు అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. విలేకరుల సమావేశంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, కె.కోటపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.సిహెచ్.స్వామి నాయుడు, కొత్తకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.అప్పలనాయుడు, చీడికాడ ఎస్సై జి.నారాయణరావు, రావికమతం ఎస్సై జి.ధనుంజయ నాయుడు, బుచ్చెయ్యపేట ఎస్సై డి.ఈశ్వరరావు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలపై చట్ట సభలో చర్చించాలి

విశాలాంధ్ర - అనకాపల్లి: కౌలురైతుల సమస్యలపై చట్ట సభల్లో చర్చించాలని, సమస్యపై అధ్యయన కమిటీని నియమించాలని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కౌలు సేద్యం చేసేవారంతా సన్న కారు భూమిలేని నిరుపేద రైతులేనని అన్నారు. వ్యవసాయ రంగంలో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారని, మారుతున్న పరిస్థితులకు అనుగు ణంగా కౌలు రైతులను ప్రభుత్వాలు గుర్తించకపోవడం వారి రక్షణ సంక్షేమానికి చర్యలు చేపట్టకపోవడం చూస్తే ప్రభు త్వాలు ఎంత చిత్తశుద్ధి ఉన్నాయో అర్థమవుతుందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, రైతు బీమా పథకాలు కౌలు రైతులకు వర్తింపజేయలేదని పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం కౌలురైతులకు లక్షా 60వేలు రూపాయలు హామీ లేని పంట రుణాలు మంజూరు చేయలేదని విమర్శించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. కౌలు రైతుల సంమస్యలపై ఒక అభ్యయన కమిటీని నియమించాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి నారు మళ్ళు నీట మునిగి ముప్పిడికి నీరుకారి పోయాయని, 10 వేల పెట్టుబడి నేలపాలు అయిందని, మళ్ళీ నారు మళ్ల వేసుకోవడానికి పెట్టుబడులేక అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడు తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని సత్యనారాయణ కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

ఏపీఐఐసీ భూములు పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర - నక్కపల్లి: ఏపీఐఐసీ సేకరించిన భూములను నర్సీపట్నం డివిజనల్ అధికారి జయరాం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఏపీఐఐసీ అధికారులతో కలిసి పరిశీలించారు. పరిశ్రమలు నిమిత్తం ఏర్పాటు చేసే పవర్ స్టేషన్‌కు సంబంధించిన భూములను పరిశీలించడంతోపాటు ఏపీఐఐసీ సేకరించిన భూములను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంతమంది రైతులకు పరిహారం అందింది ఎంతమందికి అందాల్సి ఉంది అని రైతులని అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరిహారం ఎవరికి అందలేదు అనే విషయంపై జిల్లా కలెక్టర్‌తో కలిసి చర్చించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్డీఓ పరిశీలించగా మండల టీడీపీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ రైతుతో కలిసి భూములను చూపిస్తూ ఇంతవరకు పరిహారం అందని రైతులకు భూసేకరణ చేసిన భూములకు పూర్తిస్థాయిలో పరిహారం అందజేసి వారికి న్యాయం చేయాలని నిర్మాణాలకు ఎటువంటి ఆటంకం ఉండదని తెలియజేశారు. రైతులకు న్యాయం చేసే విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని ఆర్డీఓను కోరారు. ఆయనతోపాటు ఇన్‌చార్జ్ తహశీల్దార్ నాగిరెడ్డి సత్యనారాయణ, సర్వే మూర్తి, రైతులు గంట నరసింహారావు, సురకాసుల పెద్ద గోవిందు, అయినంపూడి అప్పలరాజు తదితరులు ఉన్నారు.

150 కిలోల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని మంచాల శివారు తారు రోడ్డుపై అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన ఏడు లక్షల 50 వేల రూపాయలు విలువచేసే 150 కేజీలు గంజాయితో పాటుగా ఒక ద్విచక్ర వాహనం, ఒక ఆటో, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై జి.నారాయణరావు అన్నారు. ఆయన అందించిన వివరాలు ప్రకారం పాడేరు మండలం కుక్కి గ్రామానికి చెందిన శోభ, శ్రీను, పూలబందుకు వేమన ఈశ్వరరావు, కొర్ర కొండబాబు, హుకుంపేట మండలం దుర్గం గ్రామానికి చెందిన పాత్రుని దిలీప్ కుమార్ లు గంజాయిని రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచారు. ముందుగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో సహా వెళ్లి వారిని పట్టుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతులకు కాలువలు ద్వారా సాగునీరు అందించాలి

విశాలాంధ్ర - యస్.రాయవరం: ఇటీవల కురిసిన వర్షాలకు ఎస్.రాయవరం మండలం పి.ధర్మవరం వరహానదిలో నీరు ప్రవహిస్తున్నా, నదిని ఆనుకుని ఉన్న గ్రామాలలో వ్యవసాయ భూములకు కాలువలు ద్వారా నీరందక వరినారు మళ్ళు ఎండిపోతున్నాయని, రైతులకు కాలువలు ద్వారా నీరు సరఫరా చేయాలని సీపీఎం నాయకులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం రైతులతో కలిసి పి.ధర్మవరం, ఏటి కొప్పాక, పద్మనాభ రాజు పేట రెవెన్యూలో ఉన్న మిరాసీ కాలువను పరిశీలించారు. ఈ మిరాసి కాలువ ద్వారా నీరు వస్తేనే పి.ధర్మవరం, పద్మనాభరాజుపేట, పులపర్తి, గూండ్రుబిల్లి గ్రామంలో వరినాట్లు వేయడం జరుగుతుందని, అటువంటి ఈ కాలువలో పూడిక పేరుకుపోయి, తుప్పలు, డొంకలతో నిండిపోయిందన్నారు. నీరు పారడానికి అవకాశం లేకుండా ఉందన్నారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించి ఈ కాలువ పూడిక తీయించి, తుప్పలుడొంకలు తొలగించి రైతులకు నీరందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ఎం.రాజేష్, ఎస్.గోవిందరావు, కె.రమణ, కె.బాబూరావు, ఎ.లోవరాజు, ఎస్.సాయి తదితరులు పాల్గొన్నారు.

8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - మునగపాక: జిల్లా విద్యాశాఖ ఆదేశాలతో మండలంలో గల పాటిపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో ఆగస్టు 8వ తేదీన పాఠశాల యాజమాన్య కమిటీని తల్లిదండ్రుల ద్వారా ఎన్నిక చేస్తామని పాఠశాల ప్రిన్సిపాల్ వి.ఆశ తెలిపారు. ఆరు నుండి పది తరగతుల వరకు ఉన్న 470

మంది విద్యార్థుల తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకులు 8న పాఠశాలకు రావాలని, ఎనిమిదో తేదీ ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రతి తరగతి నుండి ముగ్గురు సభ్యులను ఎంపిక చేస్తామని, ఎంపికైన 15 మంది సభ్యులలో ఇద్దరిని చైర్మన్ వైస్ చైర్మన్‌గా ఈ సభ్యులు ఎన్నుకుంటారని ప్రిన్సిపాల్ ఆశ తెలిపారు. ఎన్నికల ప్రకటన 1వ తేదీన జారీ చేశామని ఓటర్ లిస్టులను పాఠశాల నోటీసు బోర్డులో, సచివాలయం వద్ద పెట్టామని తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఐదవ తేదీన పరిష్కరిస్తామని తదుపరి ఫైనల్ ఓటర్ జాబితాను ప్రకటిస్తామని అన్నారు. ఎనిమిదో తేదీన పూర్తిస్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పడుతుందని, ఈ కమిటీ పాఠశాలలో తరగతుల నిర్వహణ, నిధులు వినియోగం, ప్రభుత్వ పథకాల అమలు తీరు తదితర వాటిని పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఆగస్టు 8న తల్లి లేదా తండ్రి పాఠశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆహ్వానించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: బిడ్డకు పాలివ్వడం వలన తల్లికి కూడా లాభాలున్నాయని జాతీయ తల్లిపాల వారోత్స వాల్లో భాగంగా రాజాం అంగన్వాడి కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తురకలపూడి పీహెచ్‌సీ డాక్టర్ సంధ్యారాణి మాట్లా డుతూ ప్రసవంలో తల్లి బరువు ఎక్కువ పెరుగుతుంది కావున పాలివ్వడం వలన బరువు తగ్గుతారని రొమ్ము క్యాన్సర్, అండా శయ క్యాన్సర్, రక్తపోటు, టైప్ 2 మధుమేహం వంటి రోగాలు భవిష్యతులో రాకుండా అడ్డుకుంటాయని అన్నారు. పిల్లలు పుట్టిన తర్వాత తమ శిశు వులకు పాలిచ్చే తల్లులు ఎక్కువగా ఉండే దేశం క్రొయేషియా అని అక్కడ 98 శాతం మంది తల్లులు తమ బిడ్డలకు పాలిస్తున్నారని, ఇంకా రువాండా, చిలీ, బురుండి వంటి దేశాలలో ఉండే తమ పిల్లలకు పాలిచ్చే తల్లులు 80 శాతం కంటే ఎక్కువ మంది ఉన్నారని అన్నారు. కానీ కొన్ని పరిస్థితులలో అనగా ఉద్యోగరీత్యా, బయట పనులు చేయడం వలన తమ శిశువుకు పాలు అందివ్వలేరని ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారికి ప్రసవానంతర సెలవులు ఇస్తున్నారని పాలిచ్చే అమ్మ పొలం పనులకు కూలీ పనులకు, ఆ ఆరు మాసాలు వెళ్లకుండా ఇంటిలోని యజమా నులు, కుటుంబ సభ్యులు సహకరించా లన్నారు. కార్యక్రమంలో పలువురు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చోడవరం: తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని తెలియజేస్తూ మండలంలోని దామునాపల్లి గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. తల్లి పాలు వారోత్సవాల సందర్భంగా దామునాపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త రావాడ కామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు ఇవ్వాలని, తద్వారా పిల్లలకు ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్క తల్లి ఈ విషయాన్ని అర్థం చేసుకొని, పిల్లల ఎదుగుదలకు తోడ్పడాలన్నారు. తల్లిపాలలో అనేక రకమైన పోషక విలువలు ఉన్నాయని అన్నారు. గ్రామంలో అంగన్వాడి కేంద్రం నుండి మెయిన్ రోడ్, రామాలయం క్రింద వీధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు బలిరెడ్డి సూర్యలక్ష్మి, జొన్నాద శ్రీదేవి, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

యస్.రాయవరం: మండలంలోని సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అవగాహన ర్యాలీ చేస్తూ తల్లిపాలు వల్ల జరిగే ప్రయోజనం పిల్లల ఆరోగ్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శక్తి ప్రియ, వైద్య సిబ్బంది ప్రసాదు, నూకరత్నం, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

గొలుగొండ: తల్లిపాలు పిల్లలకు ఎంతో ఆరోగ్యవంతమైనవని వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి కేకే విబి గౌరి పేర్కొన్నారు. శుక్రవారం తల్లిపాలు వారోత్సవాలను గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ తల్లిపాలు వారోత్సవాలు వారం రోజులు పాటు మండలంలో అన్ని గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎన్‌వీకే శ్రావ్య శ్రీ, టీవీ రాఘవ, టి.సత్యవతి, వరలక్ష్మి, పి.భూలక్ష్మి, మనీ, బి.రత్నం, మంగతాయారు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, పుట్టిన బిడ్డకు గంటలోపు పాలిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొనెంపాలెం, చోడపల్లి గ్రామాలలో గల అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు తాగించడం వలన తల్లిలో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జి.అపరంజిని, ఏఎన్ఎం ప్రమీల, ఎంఎల్‌హెచ్ పి.కళ్యాణి, ఎంఎస్ కె.దుర్గాభవాని, అంగన్వాడి టీచర్లు కే.సరోజిని, ఆర్.మాధురి, ఆశా వర్కర్ వేణు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ ఆధ్వర్యంలో రహదారికి మరమ్మతులు

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో లింగంపేట, గుజ్జుమను పాకల గ్రామాల్లో అనేక సంవత్సరాలుగా ఆర్ అండ్ బి రోడ్డు గుంతలు పడి దర్శనం ఇవ్వడంతో మాజీ జెడ్పీటీసీ చిటికెలు తారక వేణుగోపాల్ వాటిని కప్పి వేయించారు. ఈ ప్రాంతంలో రోడ్లపై ప్రయాణికులు వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉద్దేశంతో గుంతలు ఏర్పడిన ప్రాంతాలను కప్పి వేయించడం జరిగిందని తెలిపారు. దీంతో ఈ ప్రాంతంలో ప్రయాణించే ప్రయాణికులు అందరూ మాజీ జెడ్పీటీసీ చేసిన మంచి పనికి పలువురు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - యలమంచిలి: 33/11 కెవి పెద్దపల్లి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కెవి రాంనగర్ ఫీడర్ లైన్‌కు సంబంధించి మెయింటెనెన్స్ (చెట్లు తొలగింపు) నిమిత్తం శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. శేషుకొండ కాలనీ, ఏఎస్ఆర్ కాలనీ, మర్రిబంద, పాత యర్రవరం, రాంనగర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ భారత దేశానికీ జాయితీ జెండా రూపొందించిన వ్యక్తి మన ఆంధ్రుడు, కృష్ణా జిల్లా వాసి కావడం, చిన్న వయస్సులోనే ఆర్మీలో చేరడం, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడం, చివరి కాలంలో జీవనం సాగడం కూడా చాలా కష్టంగా ఉండేదని పింగళి వెంకయ్య గురించి పిల్లలకు వివరించారు. పిల్లలకు పింగళి వెంకయ్య జీవిత చరిత్ర మీద వ్యాచ రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యా యులు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు లలితాంబ, కుసుమ కుమారి, విమల, శోభారాణి, విజయ, దీపిక, ఆర్.అప్పలనాయుడు, గారా ప్రకాష్, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బిల్లులు తక్షణమే చెల్లించాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 129 కోట్లు ఉపాధి హామీ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘాలు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని శంకరం పంచాయతీ పరిధిలో నిరసన చేపట్టారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి.వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు కె.భవానీ, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన్ బాబు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇ.నరసింహమూర్తి మాట్లాడారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి పదిహేను రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాలని నిబంధనలు ఉన్నా పనులు నిలుపుదల చేసినప్పటికీ నాలుగు వారాల నుండి ఆరు వారాలు వరకు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. బకాయిలు చెల్లించవలసిన ప్రభుత్వం కూలీల కడుపు మాడుస్తుందని తెలిపారు. ఇంతటి దౌర్భాగ్యపు పరిస్థితులు మునుపు ఎన్నడు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధుల కొరత విధించిందన్నారు. ఈ సంవత్సరం 86 కోట్లుకు కుదించి కూలీలు ఉసురు పోసుకుందని అన్నారు. పవన్ కల్యాణ్ లాంటి వారు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉండి కూలిలకు బిల్లులను రాబట్టకపోవం అన్యాయమన్నారు. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రోజు కూలి 600 ఇవ్వాలని 200 రోజులు పని కల్పించాలని అన్నిరకాల అలవెన్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పెండింగ్ ఉన్న ఉపాధి హామీ బకాయిలు చెల్లించకనపోతే ప్రజాపోరాటాలు ఉదృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్సరాజు దాసు, అప్పారావు, అప్పరాజు, స్వామి సింహాచలంతో పాటు అదిక సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.

పాడి రైతులకు విశాఖ డెయిరీ ప్రోత్సాహకాల కుదింపు దుర్మార్గం

విశాలాంధ్ర - కే.కోటపాడు: విశాఖ డెయిరీ పాడి రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలను క్రమంగా తగ్గిస్తుం డటంపై పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాడి రైతులకు ఇచ్చే బోనస్ గత సంవత్సరం నుండి నిలుపు చేయడమే కాకుండా పాల రైతులకు ఇచ్చే ఇన్సూరెన్స్ కూడా తగ్గించుకుంటూ వస్తున్నది. పాల సరఫరాతో సంబంధం లేకుండా ప్రతి పాడి రైతు 60 సంవత్సరాలు నిండిన వ్యక్తి చనిపోతే 30 వేల రూపాయలు ఆ కుటుంబానికి ఇచ్చేవారు. ప్రస్తుతం నిబంధనలు మార్చి ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి ప్రతి పాడి రైతు సంవత్సరానికి 200 లీటర్ల పాలు పోయాలి. ఆ రైతు మరణిస్తే వారసులకు కేవలం 3 వేల రూపాయలు మాత్రమే అందిస్తుంది. అలాగే 500 లీటర్లు దాటిన వారికి 7500 , 750 లీటర్లు దాటిన వారికి పదివేల రూపాయలు , వెయ్యి లీటర్లు దాటిన వారికి 15 వేల రూపాయలు ఆయా కుటుంబాలకు విశాఖ డైరీ ఇన్సూరెన్స్ చెల్లిస్తుంది. ఈ విధమైన నిబంధనలు పెట్టడం దుర్మార్గమని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు ఆరోపించారు. విశాఖ డైరీ లాభాల్లో ఉన్నందున ఆ లాభాలను రాజకీయ అవసరాలకు ఉపయోగించకుండా ప్రతి పాడి రైతుల అభ్యున్నతికి వినియోగించాలన్నారు. పాడి రైతుకు ప్రోత్సాహకాలు తగ్గించే బదులు అదనంగా పెంచాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

మృతుని కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలంలోని కింతాడ పంచాయతీ శివారు రావాలమ్మ పాలెంలో ఈనెల 27వ తేదీన వరిపొలాల్లో దమ్ము చేస్తుండగా జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన బండారు శివసన్యాసయ్య పాత్రుడు(శివ) కుటుంబ సభ్యులను మాడుగుల శాసనసభ్యులు, రాష్ట్ర మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి శుక్రవారం పరా మర్శించారు. కింతాడలో మృతుడు శివ భార్య చంద్రకళను, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సత్యనారాయణ మూర్తి పరామర్శించి ఓదార్చారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యనారాయణ మూర్తి భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సబ్బవరపు రామునాయుడు తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర
పేజి : 2
అనకాపల్లి
శనివారం 03, ఆగస్టు 2024

ప్రకృతి వ్యవసాయ నారుకు చిగురు తీసి ఉడుపులు

విశాలాంధ్ర-వంగర: కింజంగిలో రైతు వేమిరెడ్డి సూర్ నారాయణ వరినారుకు విత్తనశుద్ధి చేసి నారుకుచిగుళు తొలగించి ఉ డుపులు చేస్తున్నారు. మండలంలో మరువాడ యూనిట్ ఇంచార్జ్,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇంచార్జ్ అర్నేపల్లి సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో మండలం లో కింజంగి గ్రామం లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇన్చార్జి ఆర్నేపల్లి సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో వేమిరెడ్డి సూర్యనారాయణ వరి నారుకు విత్తనశుద్ధి చేసి కొనలు తుంచి వరుసలలో నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నాట్లు వరుస లలో తూర్పు ,పడమర దిశగా వుడుచు కోవడం వల్ల గాలి ,వెలుతురు క్రాప్ కు తగలటం వలన దోమపోటు నివారించు కోవచ్చు అని చీడ పీడలు రావటానికి అవకాశం వుండదనియు, పిలకలు అధికంగా వస్తాయి అని ఆయన వివరించారు. ముందుగా ఉ డిచిన వరి పొలం లో కాలి బాటలు నేరుగా వేయించటం, కాలి బాటలు తీయడం వలన కూడా దోమ పోటు ను నివారించవచ్చు నని వారు చెప్పారు. కార్యక్రమంలో ఐసిఆర్పి విఐసిఆర్ పి పోలినాయుడు రైతు సూర్యనారాయణ పాల్గొన్నారు.

బాబు జగజీవన్ రావ్ కు కూటమి నాయకుల ఘన నివాళులు

విశాలాంధ్ర-నక్కపల్లి: ఎస్సీ వర్గీకరణ పై కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడం సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పు ఇవ్వడం వలన సంతో షం వ్యక్తంచేస్తూ బాబు జగజీవన్ రామ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం పలువురు టిడిపి జనసేన బిజెపి నాయకులతోపాటు దళిత సంఘాలు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న కోరిక ఈ నాటికి నెరవేరింది అంటూ వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, బిజెపి మండల శాఖ అధ్యక్షులు కోసూరి శ్రీనివాసరావు, జిల్లా బిజెపి నాయకులు పోలినాటి నానాజీ ,విశ్రాంత ఉపాధ్యాయులు శేఖర్ మాస్టర్, సర్పంచ్ పెదపూడి శంకర్రావు, గంట నరసింగరావులు తదితరులు ఉన్నారు.

విజయరామరాజుపేట లో రెండు దేవాలయాల్లో హుండీల చోరీ...

విశాలాంధ్ర- బుచ్చయ్య పేట : విజయరామ రాజుపేట లో రెండు దేవాలయాలుకు చెందిన హుండీలు చోరీకి గురయ్యాయి, దొంగలు స్థానిక అంజనేయస్వామి దేవాలయం హుండీ తాళం పగలగొట్టి నగదు దోచుకున్నారు, అలాగే పోలివల్లి అమ్మ వారి ఆలయం హుండీ కూడా ఎత్తుకుని పోయారని స్థానికులు తెలిపారు వరసగా గ్రామానికి చెందిన దేవాలయం హుండీల లోని నగదు అపహరించిన దొంగలు స్థానిక స్మశానంలో దాన్ని పడేశారని, దేవాలయం చోరీ పై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

నక్కపల్లి లో తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర నక్కపల్లి: తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా నక్కపల్లి వీవర్స్ కాలనీ వద్ద ఉన్న అంగన్వాడి సెంటర్ లో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కే .లలిత మాట్లాడుతూ తల్లిపాలలో ఉన్న పోషకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజరలు సౌజన్య, తులసి, కనకదుర్గ, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 4న ఉచిత వైద్య శిబిరం

గౌరీ పట్టపు మహేష్ కుమార్

విశాలాంధ్ర-మాడుగుల : ఈ నెల 4న భారత నిర్మాణ సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు గౌరీ పట్టపు మహేష్ కుమార్ తెలియచేశారు. మాడుగుల విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశాఖపట్నం నుండి డాక్టర్ సిస్ట బాల ఆదిత్య (ఆర్థోసర్జన్) వస్తున్నట్లు చెప్పారు. వీరు అన్ని రకముల కీళ్ల నొప్పులు, కీళ్ల వాపులు, మోకాళ్ళ నొప్పులు, నడుం నొప్పి నడనొప్పి, మెడ నొప్పి ఇటువంటి దీర్ఘకాలిక సమస్యలకు ఉచితంగా చూసి మందులు కూడా ఉచితంగా ఇవ్వబడుతుందన్నారు. అవసరమైన వారికి విశాఖపట్నం ఆసుపత్రికి తీసుకొని వెళ్లి ఉచితంగా ఆపరేషన్ కూడా చేయబడునన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని చెప్పారు. మరెన్ని వివరాలు కొరకు 9885596567 నెంబర్ కి కాల్ చేయాలని సూచించారు.

నగరంలో వీధులు, కాలనీలు నిత్యం పరిశుభ్రపరచండి

జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: నగరంలో గల వీధులు, కాలువలు నిత్యం పరిశుభ్రపరచాలని, రోడ్ల పై, కాలువలలో వ్యర్థాలు లేకుండా చూడాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 2వ జోన్ లోని 9, 12 వార్డుల పరిధిలోని ఆరిలోవ ప్రాంతంలో ఎర్ని దుర్గానగర్, ఎం.ఎస్.ఎఫ్-2 మరియు ఎస్.కె.ఎం.ఎల్ నగర్ బి.ఆర్.టి.ఎస్ వద్ద గల అన్న క్యాంటీన్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ పర్యటిస్తూ నగరంలో గల వీధులు, కాలనీలు నిత్యం పరిశుభ్ర పరచాలని, వర్షాకాలం అయినందున దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని , మలేరియా, డెంగ్యూ, అతిసార వ్యాధులను నియంత్రించుటకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ పై ప్రజలకు అవగాహనను కల్పించాలని,చిన్న కాలువలతో పాటు ప్రధాన గెడ్డలలో పూడికలను తొలగించాలని, వర్షాలకు ప్రధాన కాలువలలో కొండల నుండి వచ్చే నీటికి వ్యర్థాలు అడ్డుపడకుండా కాలువలలో గ్రిల్స్ ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ శైలజ వల్లిని, పర్యవేక్షక ఇంజనీర్ శాంసన్ రాజును కమిషనర్ ఆదేశించారు. విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను వారి విధులు, పనివేళలను అడిగి తెలుసుకుని ప్రతి ఇంటి నుండి నిత్యం క్లాప్ వాహనాల ద్వారా తడి -పొడి వ్యర్థాలను వేరుగా సేకరణ జరగాలని సహాయక వైద్యాధికారి డాక్టర్ కిషోర్ ను కమిషనర్ ఆదేశించారు.తదుపరి ఎం.ఎస్.ఎఫ్-2ను సందర్శించి క్లోజ్డ్ కంపోస్ట్ సిస్టమ్ పనితీరును పరిశీలించారు. క్లాప్ వాహనాల ద్వారా వచ్చిన వ్యర్థాలను నేలపై వేయడం వలన భూమికి హాని కలగడమే కాకుండా దుర్వాసన వెదజల్లుతుందని, అందుకు ప్రత్యేకమైన వరదా పై వేసి వ్యర్థాలను నిల్వ ఉంచకుండా ఏ రోజు వ్యర్థాలు ఆ రోజే కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ కు తరలించాలని కమిషనర్ ఆదేశించారు. కాంపాక్ట్ బిన్నులు ఎన్ని ఉన్నాయి? రోజుకుఎన్ని ట్రిప్పులు ద్వారా వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ కు తరలిస్తున్నారని సహాయ వైద్యాధికారిని కమిషనర్ ఆరా తీశారు. అనంతరం ఎస్.కె.ఎం.ఎల్ నగర్ లోని అన్న క్యాంటీన్, 9వ వార్డు బి.ఆర్.టి.ఎస్ సర్వీస్ రోడ్డు వద్ద అన్నా నగర్ లోని అన్న క్యాంటీన్ లను

పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పర్యవేక్షణ రాజును కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహ ఇంజనీరు శాంతిరాజు, ఏ.ఎం.ఓ.హెచ్ కిరణ్, సహాయక ఇంజినీరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా విద్యాకమిటీ ఎన్నికలను నిర్వహించాలి

విశాలాంధ్ర-నక్కపల్లి: ఈనెల ఎనమిదో తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్స్ కమిటీ ఎన్నికల ను ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా, ప్రణాళికాయుతంగా నిర్వహించాలని ప్రతీ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు దీనిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని యల మంచిలి జిల్లా ఉపవిద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు అన్నారు. శుక్రవారం నక్కపల్లి హైస్కూలు లో జరిగిన పేరెంట్స్ కమిటీ ఎన్నికల నిర్వాహణ అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమిటీలలో ప్రధానపాత్రధారులు విద్యార్థుల తల్లిదండ్రులేనని,ఒక్కో తరగతి నుండి ముగ్గురు సభ్యుల చొప్పున ఎన్నుకోవలసి ఉంటుందని,వీరిలో సామాజిక ప్రతికూల పరిస్థితి లను ఎదుర్కొంటున్న వర్గాలనుండి ఒకరు,బలహీన వర్గాలకు చెందిన వారినుంచి ఒకరు,జనరల్ కేటగిరీ నుండి ఒకరు ఉండాలి. ఈ ముగ్గురు లో ఇద్దరు కనీసం మహిళలు ఉండాలి. ఎన్నికల నిర్వహణకు కనీసం 50శాతం మంది తల్లిదండ్రులు, లేదా సంరకకులు ఉండాలి.నోటిమాటతోకానీ, చేతులను ఎత్తడంతో గానీ, రహస్య బ్యాలెట్ విధానం ద్వారా గాని ఎన్నికలను జరిపించాలని ఆయన అన్నారు .తరగతి పిల్లల తల్లిదండ్రులు లో ఎవరో ఒకరికి మాత్రమే కమిటీ సభ్యుల ఎన్నికలలో ఓటు వేసే అర్హత ఉంటుందని అన్నారు. పాఠశాలలో ఎన్ని తరగతులుంటే

అన్నితరగతులనుండి అనగా ఒకొక్క తరగతి నుండి సభ్యులను ఎన్నుకోవాలి. అనంతరం మండలవిద్యాశాఖాధికారి కె.నరేష్, ప్రధానోపాధ్యాయులు వేమగిరి నూకరాజు, రాణి లలిత, నారాయణరావు,డి.సత్యారావు, అప్పలరాజు, సుందరరావు,చోడిశెట్టి సత్యనారాయణ త్రినాధరావు, మూర్తిరాజు, కవిత లు పాల్గొని విద్యాకమిటీ ఎన్నికల నిర్వహణ గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్. ఆచార్యులు, డి.వి.సన్యాసిరావు, శివాజీ,టి.వి.రమణ పి.వెంకటరావు, డి.కొండలరావు సి.ఆర్.పి.డి.అప్పారావు పలుపాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమాలు తొలగించినా యధావిధిగా నిర్మాణాలు

-నోటీసులు ఇస్తున్నా తీరుమారని వైనం
-కరెంటు కనెక్షన్ ఇవ్వొద్దంటూ విద్యుత్ శాఖకు టౌన్ ప్లానింగ్ లెటర్!

విశాలాంధ్ర-అనకాపల్లి: జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో అక్రమ నిర్మాణదారులు బరితెగిస్తున్నారు. తాము చేసిన అక్రమ నిర్మాణాలను కప్పిపుచ్చుకోవడానికి తప్పులు మీద తప్పులు చేస్తూ టౌన్ ప్లానింగ్ సిబ్బందినే ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు అనేకం. రెసిడెన్షియల్ అనుమతులు పొంది కమర్షియల్ భవన నిర్మాణం చేపట్టేది ఒకరైతే.. తీసుకున్న అనుమతులకు సంబంధం లేకుండా నిర్మాణాలు చేపట్టేది మరికొందరు.. ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని అంతకుమించి అదనపు నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది హెచ్చరించిన వాటిని పట్టించుకోకుండా యదేచ్చగా అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల నిర్మాణం అవుతున్నాయి. ఉదాహరణకు పూడిమడక రోడ్డులో ఒక వైద్యుడు నిబంధనలను అతిక్రమించి నిర్మాణం చేపడితే టౌన్ ప్లానింగ్ నుంచి నోటీసులిచ్చి తొలగించారు. కొద్ది రోజులు సైలెంట్ గా ఉన్న ఆ నిర్మాణదారుడు మళ్లీ అక్రమ నిర్మాణాన్ని చేపట్టాడు. విషయం గమనించిన అధికారులు మళ్లీ నోటీసులు ఇచ్చిన వాటిని బేఖాతరు చేస్తూ టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. టౌన్ ప్లానింగ్ అధికారులు ఇక చేసేదేమీ లేక సదరు నిర్మాణానికి ఎటువంటి విద్యుత్ కనెక్షన్ ఇవ్వొద్దంటూ విద్యుత్ శాఖకు లెటర్ పెట్టడం విశేషం.. ఇలా ఒకటి కాదు రెండు కాదు జోన్ పరిధిలో నిత్యము ఇలాంటి అక్రమ నిర్మాణాలు అనేకం నిర్మాణం అవుతున్నాయి. అంతేకాకుండా ఇరుకు సందులలో నిబంధనలను అతిక్రమించి బహుళ అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంపై కూడా అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగాన్ని గాడిలో పెట్టడమే కాకుండా.. నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై కూడా అధికారులు సీరియస్ యాక్షన్ తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కొణిదెల నాగబాబుతో రాయపురెడ్డి కృష్ణ భేటి

విశాలాంధ్ర-మాడుగుల : శుక్రవారం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో మాడుగుల నియోజకవర్గ ఇంచార్జ్ రాయపురెడ్డి కృష్ణ జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబుతో భేటీ అయ్యారు. గడిచిన ఎన్నికల్లో నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి కష్టపడిన కార్యకర్తలు వివరాలను ఆయనకి లిఖితపూర్వకంగా అందజేశారు రానున్న స్థానిక సంస్థల్లో కానీ నామినేటెడ్ పదవుల్లో గాని నియోజకవర్గంలో కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు కల్పించాలని కోరడం జరిగింది. నియోజకవర్గంలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు కూడా తగిన న్యాయం చేస్తామని నాగబాబు హామీ ఇవ్వడం జరిగిందని కృష్ణ తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో సమన్వయంతో పనిచేయాలని సూచించారన్నారు. నాలుగో విడత క్రియాశీల సభ్యత్వం నమోదు కూడా గత సంవత్సరం కంటే రెండు రెట్లు అధికంగా చేయడం వల్ల కార్యకర్తకి భద్రత కల్పించడంలో నియోజకవర్గ ముందడుగు వేసినందుకుగాను సంతోషం వ్యక్తపరిచారు.

రవికృష్ణరాజులా ఇంజినీర్లు పనిచేయాలి

జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖ పట్నం: జీవీఎంసీ ప్రధాన ఇంజినీరుగా నగరానికి ఆదర్శ నీయమైన అనేక సేవలు అందించి, అందరి మన్ననలు పొంది ఉద్యోగ విరమణ చేసిన పి.రవి కృష్ణరాజు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పి.రవికృష్ణరాజు సన్మానసభను అధికారులు, ఇంజినీర్లతో కలిసి నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన ఇంజినీర్ గా పి.రవికృష్ణరాజు సేవలు జీవీఎంసీ ఇంజినీర్లకు, అధికారులకు అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచాయన్నారు. రవికృష్ణ రాజు మంచి విద్యావంతులని, సానుకూల వైఖరి కలవారని జీవీఎంసీలో ప్రధాన ఇంజనీర్ గా మూడు సంవత్సరాల కాలం విధులు నిర్వహించి ఎన్నో సంస్కరణలను ప్రవేశపెట్టి, తన విభాగంలో వారందరికీ స్ఫూర్తిదాయకమైన సలహాలను, సూచనలను చేసి, మిలాన్, గిరి ప్రదక్షిణ, చందనోత్సవం, తదితర ఎన్నో ప్రత్యేకమైన కార్యక్రమాలను నగరంలో విజయవంతంగా నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారని కమిషనర్ కొనియాడారు. ఏ అధికారైన ప్రజలతో, అధికారులతో, ప్రజాప్రతినిధులతో, మేధావులతో విధులు విషయంలో చర్చించినట్లయితే చాలా సమస్యలకు వెంటనే పరిష్కార మార్గం దొరుకుతుందని, అందుకు రవికృష్ణ రాజు మార్గదర్శకాలను ఉదాహరణగా తీసుకోవాలని కమిషనర్ అధికారులకు సూచించారు. కడపలో వరదలు సంభవించినప్పుడు సమయస్ఫూర్తితో ఏర్పడిన సమస్యలను రవికృష్ణరాజు పరిష్కరించారని కమిషనర్ తెలిపారు. ఆయన మున్సిపల్ ఇంజనీరుగా పలు మున్సిపాలిటీలలో, కార్పొరేషన్ లలో పనిచేసి తనదైన ప్రత్యేక ముద్రను వేశారని అలాగే జీవీఎంసీ లో కూడా ఆయన సేవలు చిరస్మరణీయమని, అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచి 36 సంవత్సరాల సుదీర్ఘకాలం ప్రభుత్వానికి సేవలందించి నేడు జీవీఎంసీ నందు ప్రధాన ఇంజనీరుగా ఉద్యోగ విరమణ పొందినందుకు వారిని అభినందిస్తూ, శేష జీవితం ఆనందంగా కుటుంబంతో గడపాలని కోరుకుంటూ కమిషనర్ రవికృష్ణరాజును పూలమాల, దుశ్శాలువ తో సత్కరించి జ్ఞాపికను బహుకరించి సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ డాక్టర్ వై శ్రీనివాసరావు, ఎస్.ఎస్.వర్మ, ఇన్చార్జి చీఫ్ ఇంజినీర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజు నుండి చాలా నేర్చుకున్నామని, ఎటువంటి సమస్యకైనా ఆయన దగ్గర పరిష్కార మార్గం దొరుకుతుందని, మున్సిపల్ ఇంజినీరుగా ఎంతో కాలం పని చేసిన అనుభవంతో వారు కొత్త సంస్కరణలను మనకు అందించారని, రవికృష్ణరాజును ఇంజినీర్లు అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తూ ..., రవి కృష్ణ రాజు శేష జీవితం ఆనందంగా గడపాలని కోరుకుంటూ వారిని అభినందించారు. అనంతరం జీవీఎంసీ అధికారులు, ఇంజనీర్లు ,ఉద్యోగులు ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజుకు పుష్ప గుచ్చాలను అందించి సత్కరించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ప్రధాన ఇంజినెరు రవికృష్ణరాజు మాట్లాడుతూ జివిఎంసి నందు తన అందించిన సేవలకు సహకరించిన జివిఎంసి అధికారులకు, ఇంజినీర్లకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలుపుతూ విధి నిర్వహణలో సలహాలు, సూచనలు కోరిన ప్రతీ ఒక్కరికి సహకరిస్తానన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్ కుమార్, అందరు పర్యవేక్షక ఇంజినీర్లు, పి.డి.యు.సి.డి ఫణిరామ్, కార్యనిర్వాహక ఇంజినీర్లు, సహాయక ఇంజినీర్లు, వార్డు కార్యదర్శులు, డిపిఓలు, ఏపీడీలు తదితరులు పాల్గొన్నారు.